క్లుప్తంగా

గాంధీనగర్‌లో సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే నాగిరెడ్డిని కోరారు. అసోసియేషన్ కొత్త కార్యవర్గ సభ్యులు గొర్లి రామునాయుడు, పీవీటీ రమణారావు, తెంటు సత్యనారాయణ వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణతో కలసి ఎమ్మెల్యేను మంగళవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బలగా రామారావు, గొర్లి పాపినాయుడు, బాసంగి తిరుపతిరావు, మన్మథరావు తదితరులున్నారు.

లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం



సింగిల్ ఫేజ్ నుంచి త్రీ ఫేజ్‌కు మారుస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి బాపూజీ కాలనీ, నేతాజీ కాలనీ, ప్రియదర్శినీ కాలనీల్లో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ రిషికేష్ తెలిపారు. విద్యుత్ సమస్యను కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఇటీవల తమ దృష్టికి తీసుకురావడంతో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆయా ప్రాంతాల్లోని వైర్లను సింగిల్ ఫేజ్ నుంచి త్రీ ఫేజ్‌కు మార్చామని చెప్పారు. ఇకపై కరెంట్ సరఫరాలో ఎటువంటి హెచ్చుతగ్గులు ఉండవని తెలియజేశారు.

'ఐలా ఏర్పాటుతో జీవీఎంసీకి నష్టం'

ఉక్కునగరం: రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా)ను ఏర్పాటు చేయడం వల్ల జీవీఎంసీకి నష్టం వాటిల్లనుందని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి. గంగారావు తెలిపారు. అదానీ స్థాపించనున్న సంస్థల నుంచి వచ్చే ఆదాయాన్ని కోల్పోయేలా చేసిన చర్యలను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఐటీ హిల్-4లో ఐలా పరిధికి కేటాయించిన 276 ఎకరాల భూమి మొత్తం అదానీ కోసం మాస్టర్ ప్లాన్-2041లో మిక్స్‌డ్ యూజ్ జోన్-2 గా మార్చేశారన్నారు. దాని వల్ల జీవీఎంసీకి పన్నుల రూపేణా రావలసిన వందల కోట్లు నష్టపోనుందన్నారు. వెంటనే ఐలాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

810వ రోజుకు రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టనున్న రాస్తారోకోను విజయవంతం చేయాలని ఉక్కు గుర్తింపు యూనియన్ నాయకుడు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 810వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎస్ఎంఎస్-1 కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్ష శిబిరాన్ని సందర్శించిన కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ కలేనా..!



ఇరుకుగా ఉన్న కూర్మన్నపాలెం, దువ్వాడ రైల్వే స్టేషన్ రహదారి

- ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగని పనులు
- ఇరుగ్గా కూర్మన్నపాలెం- దువ్వాడ రైల్వేస్టేషన్ రహదారి
- ప్రయాణికుల అవస్థలు

కూర్మన్నపాలెం: సమన్వయ లోపమే శాపమై రహదారి విస్తరణ ముందుకు సాగడం లేదు. కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు పనులను కాంట్రాక్టర్లు ప్రారంభించి, మధ్యలో వదిలేయడంతో విస్తరణ కలగానే మిగిలిపోయింది. ఈ మార్గంలోనే వీఎస్ఈజెడ్ కార్మికులు, ఫార్మా ఉద్యోగులు, రైలు ప్రయాణికులు, ఇంజినీరింగ్ కళాశాలకు రాకపోకలు సాగించే విద్యార్థులు ప్రయాణిస్తారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఏర్పడుతుంది. గతంలో అనేకమార్లు ఈ రహదారి సరిగా లేకపోవడంతో పలువురు ప్రయాణికులు మృత్యువాత పడ్డారు. మరికొందరు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రి పాలయ్యారు. దీంతో ఇరుకు మార్గంలో ప్రయాణమంటేనే వాహనచోదకులు భయపడే పరిస్థితి నెలకొంది.

ఆదర్శ రైల్వే స్టేషన్‌గా రూపాంతరం చెందిన దువ్వాడ రైల్వే స్టేషన్ ఒక పక్క.. వీఎస్ఈజెడ్ పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాల రాకపోకలు, బహుళ అంతస్తులు భవనాల నిర్మాణాలు మరో పక్క ఉండడంతో ఇక్కడ రహదారి విస్తరణ అనివార్యమైంది. దీంతో 2018లో వంద అడుగుల రహదారి విస్తరణ పనులకు ప్రణాళికలను రూపొందించారు. పనులను అప్పగించేందుకు ఎదురుచూస్తున్న తరుణంలో ఎట్టకేలకు వీఎంఆర్‌డీఏ పనులు చేపట్టేందుకు ముందుకు రావడంతో 2.10 కిలో మీటర్ల రోడ్డు విస్తరణ చేపట్టేందుకు 9 కోట్ల 10 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయి. దీంతో వందడుగుల విస్తరణ చేసేందుకు చకచక పనులు ప్రారంభించినా, అటు జీవీఎంసీ, ఇటు వీఎంఆర్‌డీఏ అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఎక్కడి పనులు అక్కడే అగిపోయాయి. మరి ముందుకు సాగలేదు.

ఇదీ సమస్య..

మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల రహదారిని 100 అడుగులకు విస్తరించేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీంతో ఇక్కడ స్థలాలు కోల్పోయిన వారికి నాలుగు రెట్లు టీడీఆర్ ఇవ్వాల్సి ఉంది. 166 మంది నుంచి స్థలాలు సేకరించినా, కొంతమంది లబ్ధిదారులకు మాత్రమే టీడీఆర్ ఇచ్చి, అప్పటి అధికారులు చేతులు దులిపేసుకున్నారు. రహదారి విస్తరణకు అడ్డంకిగా ఉన్న 34 నిర్మాణాలు తొలగించాల్సి ఉన్నా, కొన్ని మాత్రమే తొలగించి మమ అనిపించారు. మార్గమధ్యంలో ఉన్న విద్యుత్ స్తంభాలను వేరేచోటుకు తరలించకుండానే విస్తరణ పనులకు ముందుకు వెళ్లడంతో ఇబ్బందులు తప్పలేదు. విద్యుత్ స్తంభాల తరలింపు ప్రక్రియను వీఎంఆర్‌డీఏ చేస్తుందని జీవీఎంసీ అధికారులు ప్రతిపాదనలు చేపట్టలేదు. పనులు మొదలయ్యాక విద్యుత్ స్తంభాల అంశం తమకు సంబంధం లేదని వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీకి షాకిచ్చింది. దీనికి తోడు వివిధ భవనాలను, రేకుల షెడ్డులను, షాపులను తొలగించకపోవడంతో విస్తరణ పనులకు అవి కూడా అడ్డంకిగా మారాయి. వందడుగుల రోడ్డు విస్తరణకు అవసరమైన హద్దులు మార్కింగ్ అయినా, ఆయా స్థలాల్లో మరలా భవన నిర్మాణాలకు జీవీఎంసీ అనుమతులను మంజూరు చేయటంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి



రహదారి విస్తరణకు సంబంధించి కొంతమందికి నేటికీ డబుల్ టీడీఆర్ ఇవ్వలేదు. ఇక్కడ స్థలాలు కోల్పోయిన వారికి నాలుగు రెట్లు టీడీఆర్ చెల్లించాల్సి ఉన్నా, ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో పనులు ముందుకు వెళ్లడం లేదు. అధికారులు స్పందించి, నిర్వాసితులకు న్యాయం చేయాలి.

– చేగొండి శ్రీనివాస్, రాజీవ్‌నగర్

అగనంపూడి ఆస్పత్రి ఆర్ఎంవోగా డాక్టర్ భారతి



అగనంపూడి: అగనంపూడి ఏరియా ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంవో)గా డాక్టర్ జె.భారతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ భారతి గతంలో అగనంపూడి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా 2011 నుంచి 2017 వరకు ఆరు సంవత్సరాల పాటు విధులు నిర్వహించారు. తరువాత అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం అనకాపల్లి ఆస్పత్రి సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆమెను పూర్తి బాధ్యతలతో కూడిన ఆర్ఎంవోగా నియమించారు. ఇప్పటి వరకు డాక్టర్ గోపాలకృష్ణ ఇన్‌చార్జ్ ఆర్ఎంవోగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భారతి మాట్లాడుతూ అప్పట్లో తక్కువ మంది వైద్యులు ఉన్నప్పటికీ స్థానిక పెద్దలు, ప్రజల సహకారంతో నెలకు 140 వరకు శస్త్ర చికిత్సలు చేసేవారమన్నారు. ప్రసూతి ఆస్పత్రిగా ఈ ప్రాంతంలో అగనంపూడి ఆస్పత్రికి మంచి పేరుందని, అందరి సహకారంతో అన్ని విభాగాల్లో మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల ప్రతినిధులు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కిడిమి హనుమంతరావు, బి.వి.రామారావు, బలిరెడ్డి సత్యనారాయణ, పెదపాటి బ్రహ్మానందం, పాడుగు రామారావు, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలత, ల్యాబ్ ఇన్‌చార్జ్ పిళ్లా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



ఈశ్వరరావును సత్కరిస్తున్న జాగారపు శ్రీను

పెదగంట్యాడ: అనకాపల్లి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో పరవాడ మండలం లంకెలపాలేనికి చెందిన సీనియర్ న్యాయవాది కింతాడ ఈశ్వరరావు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఆయనను విశాఖ కన్జ్యూమర్ ఫోరం అధ్యక్షుడు జాగారపు శ్రీను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. కార్యక్రమంలో తోకాడ శ్రీను, రామచంద్రరావు, రమేష్, జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్య కొలిక్కి..

- ఎమ్మెల్యేకు కార్పొరేటర్ల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే నాగిరెడ్డిని సత్కరిస్తున్న కార్పొరేటర్లు

గాజువాక : తుంగ్లాం, యాదవ జగ్గరాజుపేట, ఫకీర్‌తక్యా, వడ్లపూడి గ్రామాలకు చెందిన ఏపీఐఐసీ నిర్వాసితుల ఇళ్ల స్థలాల సమస్యను గాజువాక ఎమ్మెల్యే కొలిక్కి తేవడంపై ఆయా గ్రామాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న జీవీఎంసీ కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు నిర్వాసితుల జాబితాలపై జిల్లా ఉన్నతాధికారులు సర్వే చేపట్టిన నేపథ్యంలో 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు తదితరులు ఎమ్మెల్యేను మంగళవారం కలిశారు. ఆయన్ను సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. నిర్వాసితులందరికీ న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టడం హర్షణీయమని పేర్కొన్నారు.

పార్కుల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



130 అడుగుల రోడ్‌లోని పార్కు స్థలంలో డెబ్రిస్‌ను తొలగిస్తున్న సిబ్బంది

- ఇప్పటికే పది పార్కుల గుర్తింపు
- శ్మశానవాటికల పరిశుభ్రతకూ చర్యలు

గాజువాక : గాజువాకలోని పార్కుల్లో పారిశుద్ధ్యంపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించారు. పార్కుల్లోని తుప్పలు, పిచ్చి మొక్కలు, డెబ్రిస్‌ను తొలగించాలని నిర్ణయించారు. దీనికోసం గ్యాంగ్ వర్క్‌లను చేపట్టారు. ప్రాధాన్యతా క్రమంలో తొలుత 10 పార్కుల్లో పరిశుభ్రత పనులను చేపట్టాలని నిర్ణయించిన అధికారులు రెండు రోజులుగా పనులను ముమ్మరంగా సాగిస్తున్నారు. ప్రజారోగ్య విభాగం సిబ్బందితో ప్రతి శనివారం పార్కుల్లో ప్రత్యేక శానిటేషన్ నిర్వహించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. 130 అడుగుల రోడ్డులోని పార్కు, అమరావతి పార్కు సహా మొత్తం పది పార్కుల్లో చెత్తను, ముళ్ల తుప్పలను తొలగించడంతో పాటు డెబ్రిస్‌ను పూర్తిగా తొలగించి జనం సేదదీరేందుకు అందంగా తయారు చేసే విధంగా పనులను నిర్వహిస్తున్నారు.

శ్మశాన వాటికల్లోనూ ప్రత్యేక డ్రైవ్: జోన్ పరిధిలో ఎంపిక చేసిన వివిధ శ్మశాన వాటికల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. తమ ప్రాంత శ్మశానం బాగా లేదంటూ నివాసుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ప్రతీ ఆదివారం ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. దీనికోసం గ్యాంగ్ వర్క్స్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో పనులు

ప్రాధాన్యతా క్రమంలో అన్ని పార్కుల్లో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ పనులను చేపడతాం. సాయంత్రం పూట ప్రజలందరూ పార్కులకు వెళ్లి సేద దీరే విధంగా అందుబాటులోకి తేవాలన్నదే లక్ష్యం. ముందుగా పది పార్కులను ఎంపిక చేసి పనులు ప్రారంభించాం.

– డాక్టర్ కిరణ్ కుమార్, గాజువాక జోన్ సహాయ ప్రజారోగ్యాధికారి

8 నుంచి గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు



పాఠశాల ప్రధానోపాధ్యాయునికి వేసవి శిబిరాల షెడ్యూల్ అందజేస్తున్న గ్రంథాలయాధికారి చంద్రకళ

గాజువాక : గాజువాక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8నుంచి వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తెలిపారు. ఈ కార్యక్రమ వివరాలను తెలియజేసేందుకు మంగళవారం ఆమె వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిశారు. ఈ నెల 8నుంచి వచ్చే నెల 16 వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు.

పెదగంట్యాడ: పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నామని గ్రంథాలయాధికారి ఎ.శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా చిన్నారులకు స్టోరీ టెల్లింగ్, డ్రాయింగ్, యోగా, గేమ్స్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఉంటుందని తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'కళాభిరుచి' విజేతలకు బహుమతులు



విజేతలతో సాహితీ సమాఖ్య ప్రతినిధులు

ఉక్కునగరం: ఉక్కు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం కళాభిరుచుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సాహితీ సమాఖ్య సభ్యుడు జి. తిరుపతిరావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో, ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో స్మారక పోటీలు నిర్వహించారు. కథలు, కవితలు, జానపద గేయాల పోటీలు నిర్వహించి, విజేతలను ఎంపిక చేశారు. స్టీల్‌క్లబ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి, మాజీ వైద్యాధికారి డాక్టర్ సి.హెచ్.వి.ఎస్.ఎన్.మూర్తి, సమాఖ్య మాజీ కార్యవర్గ సభ్యుడు ఎస్.ఎస్.శాస్త్రి, విస్కా కార్యదర్శి ఎ.కేశవరావు హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. సాంబమూర్తి, రామారావు, సత్యనారాయణ, డి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సాగర తీరం.. స్మృతుల పరిమళం



యారాడ తీరంలో కలుసుకున్న 2002-03 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

- యారాడ బీచ్‌లో అ'పూర్వ' సంగమం
- రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్న మిత్రబృందం

పెదగంట్యాడ: ఆహ్లాదకర యారాడ తీరం మంగళవారం స్మృతుల పరిమళాన్ని అద్దుకుంది. ఇరవయ్యేళ్ల అనంతరం కలుసుకున్న ఆ మిత్రబృందం ఆనందానికి ఆకాశమే హద్దయింది. దాదాపు 165 మంది పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరడంతో కోలాహలం నెలకొంది. 2002-03 విద్యాసంవత్సరంలో విశాఖ విమల విద్యాలయంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం ఉదయం యారాడ తీరంలో కలుసుకున్నారు. ఒకరినొకరు పోల్చుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పట్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకుని, తలపుల్లో విహరించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఆటలు పోటీలు పెట్టుకుని విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డైసీ సిస్టర్‌ను ఘనంగా సత్కరించారు. తమతో కలసి చదువుకున్న విద్యార్థుల్లో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. మళ్లీ కలుద్దామంటూ భారమైన మనసులతో వీడ్కోలు పలికారు.

గడప వద్దకే సంక్షేమ పథకాలు



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: అర్హతే ప్రాతిపదికగా, కుల మత రాజకీయాలకు అతీతంగా ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా పాలనను చేరువ చేశారన్నారు. 69వ వార్డు కాపులుప్పాడ గ్రామంలో మంగళవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికీ వెళ్లి, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. గతంలో పింఛన్ రావాలన్నా జన్మభూమి కమిటీ సభ్యుల అజమాయిషీ ఉండేదని, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీనే అర్హులైన ప్రతీ ఒక్కరి ఇంటికీ వచ్చి, తలుపు తట్టి వలంటీర్లు పింఛన్ అందిస్తున్నారని చెప్పారు. ఇది సంక్షేమ ప్రభుత్వమని చెప్పారు. కార్యక్రమంలో స్థానికుల నుంచి వచ్చిన పలు సమస్యలపై సంబంధిత సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి, పరిష్కరించారు. 69వ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, విరోతి రాము, సాలాపు వెంకటరావు, టమడాల కృష్ణంరాజు, అంగ బాబూరావు, బొడ్డు శ్రీరాములు, కాకి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న పోర్టు కార్మిక నాయకులు

గాజువాక : గంగవరం అదాని పోర్టులో 14 ఏళ్ల నుంచి జీపీఎస్ కార్మికులుగా పని చేస్తున్నవారికి కనీస వేతనం రూ.36వేలుగా నిర్ణయించాలని గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.జగన్, నొల్లి తాతారావు డిమాండ్ చేశారు. గాజువాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. విశాఖపట్నం పోర్టు మాదిరిగా గంగవరం పోర్టు జీపీఎస్ కార్మికులకు కనీస వేతనం రూ.36వేలు అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు రూ.1,500 నుంచి రూ.2,500 వరకు ఇంక్రిమెంట్ వేస్తామని చెబుతున్నారని, దీనిపై కూడా స్పష్టత లేదని పేర్కొన్నారు. అక్రమ కేసులతో కొంతమందిని ఉద్యోగాల నుంచి తొలగించారని, వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిలపక్ష కార్మిక సంఘాలను, పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమించక తప్పదని పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు కొవిరి అప్పలరాజు, పేర్ల నూకరాజు, వాసుపల్లి ఎల్లయ్య, కె.సత్తిరాజు, ఎం.అప్పారావు, కోనేటి వెంకట రమణ, జి.అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో విజయవంతం చేయాలి



నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న రాస్తా రోకో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన వైఎస్సార్‌టీయూసీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర జేఏసీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ జిల్లాల్లో రాస్తారోకో నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో అగనంపూడి, కూర్మన్నపాలెం, గాజువాక, పెదగంట్యాడలలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు రాస్తారోకో చేయాలని నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులు తమ కుటుంబ సభ్యులతో పాల్గోవాలని కోరారు. కార్యక్రమంలో కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, అండిబోయిన అప్పారావు, బొడ్డ గోవింద, నమ్మి ప్రసాద్ తదిరులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై ముగిసిన బ్రహ్మోత్సవాలు

సింహాచలం: వెంకటాద్రిపై ఐదు రోజులుగా జరిగిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు ఆలయంలో పలు విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారి చక్రస్నాన మహోత్సవం..సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులు వెంకన్న, శ్రీదేవి,భూదేవిల చెంత పలు రకాల పుష్పాలతో శ్రీ పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. మహాపూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ద్వాదశారాధన, విశేష అర్చనలు, ఉంజల్‌సేవ నిర్వహించారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ తదితరులు పూజలు చేశారు.

నగరానికే 'గైస్' గర్వకారణం

మేయర్ హరివెంకటకుమారి



కళాశాల అధ్యాపకులతో మేయర్ హరివెంకట కుమారి

మురళీనగర్: పాలిటెక్నిక్ స్థాయిలో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ నూరు శాతం ఉద్యోగాలు సాధించడం విశాఖ నగరానికే గర్వకారణమని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒక ఏడాదిలో 243మంది ఉద్యోగాలు సాధించడం రాష్ట్రంలోనే ఒక రికార్డు కాగా వీరిలో 54మంది బాలికలు ఉండడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా హెచ్‌పీసీఎల్‌లాంటి ప్రభుత్వ రంగ సంస్థలో 85మంది ఉద్యోగాలు సాధించడానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. గైస్ విద్యార్థిని డి.వంశీప్రియాంక ఏషియన్ పెయింట్స్‌లో అత్యధిక ప్యాకేజీ రూ.6.73లక్షలు పొందిన మొట్టమొదటి విద్యార్థినిగా రికార్డు సాధించిందని ఆమె ప్రశంసించారు. ప్రత్యేక అతిథి 54వ వార్డు కార్పొరేటరు చల్లా రజనీ ఈశ్వరరావు మాట్లాడుతూ తమ వార్డులోని కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉద్యోగాల సాధనలో రికార్డు సృష్టించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ తమ కాలేజీకి ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుతో పాటు ప్రిన్సిపాల్‌గా గ్లోబల్ అచీవ్‌మెంటు అవార్డు, ఇంటర్నేషనల్ అకడమిక్ లీడర్, గ్లోబల్ ఫ్యాకల్టీ అవార్డులు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన 243మందికి మేయరు హరి వెంకటకుమారి, కార్పొరేటరు రజనీ ఈశ్వరరావు నియామక పత్రాలు అందించారు. అనంతరం తల్లిదండ్రులను, ప్రిన్సిపాల్ వెంకటరమణను సత్కరించారు. ముందుగా లవ్ గైస్ లోగోను మేయరు హరివెంకట కుమారి కార్పొరేటరు రజనీ ఈశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఐఎస్‌టీఈ లోకల్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఓ.రామమోహన్‌రావ్, కెమ్‌దోసా అధ్యక్షుడు ఎ.వరహాలు, సభ్యులు డాక్టర్ బోకం దేముడు, యూఎస్ శర్మ, బీఎస్ రామమోహన్, కెమికల్ ఇంజినీరింగు హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు పాల్గొన్నారు.